# రాధాగోపాళం

-ఎం.మాధవీకృష్ణ

"బై మమ్మీ...బై డాడీ'' నోట్లో బబుల్‌గమ్‌తో స్టయిల్‌గా గాల్లోకి కుడిచేతి వ్రేళ్ళు మాత్రమే కదుపుతూ చెప్పాడు అభిరాం. సైలెంట్‌గా నేలనదిమి పెట్టి ఒక్కడుగు పైకి లేచి దుమ్మురేపుకుంటూ ఒక్కసారిగా చిన్న జర్క్‌తో రైట్ టర్న్ తీసుకుని వెళ్లిపోయింది 275సిసి పవర్ ఉన్న రెడ్‌కలర్ కైనెటిక్ బైక్.దూరంగా కనిపించేవరకూ చేతులూపుతూనే ఉంది బైక్ వెనుక కూర్చున్న మృదుల.

ఆ అమ్మాయి వేసుకున్న వైట్ టీ షర్ట్, డార్క్ బ్లూ జీన్స్‌ప్యాంట్, మెడవెనుక అటూ ఇటూ ఊగుతున్న పోనీటెయిల్, అటోకాలూ-ఇటో కాలూ వేసుకుని బ్యాక్‌సీట్లో కూర్చున్న విధానం పెద్దవాళ్ల ముందునుంచి కదిలాం కదా అనుకుంటూ ఫ్రీగా భర్తని వెనుక నుండి హత్తుకుపోతూ కూర్చున్న పద్ధతిలో స్వేచ్ఛ.

"వాళ్ళు వెళ్ళిపోయి పదినిముషాలు పైనే అయింది లోపలికి రావోయ్'' టాటా చెప్పడానికి ఎత్తిన చేతిని అలాగే వాకిలికి ఆన్చుకుని ఏదో ఆలోచనలో నిలబడిపోయిన రాధాకుమారిని కుదుపుతూ పిలిచాడు నందగోపాల్.

"అలా చూడడం తప్పితే చేసేదేముంది?'' మూతి ముద్దుగా తిప్పుతూ నిష్ఠూరంగా అంది రాధ.

"ఏమిటోయ్! అత్తగారి హోదా ఒంటబట్టిందా? కొడుకు, కోడల్ని చూసి ఈర్ష్య పడుతున్నావా?'' అడిగాడు గోపాలం.

"ఛ ఛ! భలేవారే మీరు. అయినా ఈ వేషమేంటి మీకు?'' అప్పుడే గమనించి ఆశ్చర్యంగా అడిగింది. ఎప్పుడూ పంచె కట్టులో కానీ ప్యాంటులో కానీ ఉండే గోపాలం మోకాళ్ల వరకూ జీన్స్ షార్ట్, టీ షర్ట్, చెవులకు వాక్‌మెన్ తగిలించుకుని చేతులు రెండూ తిప్పుతూ సన్నగా హమ్ చేసుకుంటూ స్టయిల్‌గా... ఆమె మాటలు వాక్‌మెన్ సౌండ్‌లో విన్పించకపోయినా కళ్లల్లో తనని ఆపాదమస్తకం చూస్తూ కనిపించే ఆశ్చర్యం గమనించి "నీకు ఇలా మోడ్రన్‌గా కన్పించడం ఇష్టం కదా! ఇక్కడికి వచ్చిన దగ్గర్నించి నీ అభిరాంని గమనించడం చూస్తూ ఉన్నాలే. ఏదో నీ మురిపెం తీరుద్దామని'' చెప్పాడు. యాభై ఏడేళ్ళ గోపాలం ఏడేళ్ళు తగ్గినట్లుగా కన్పిస్తున్నాడు ఆ బట్టల్లో.

"నా మొహం. వెర్రి వెధవ. చిన్నప్పుడు నిక్కర్లు వేస్కోరా ముద్దుగా ఉంటావ్ అంటే ప్యాంట్లు కుట్టించమని ఏడిచేవాడు.. ఇప్పుడు గడ్డాలు, మీసాలు వచ్చేక ప్యాంట్లో, లుంగీలో కట్టుకోవాల్సిన వయసులో ఆ షార్ట్ వేసుకుని ఇల్లంతా తిరుగుతుంటే ఆశ్చర్యంగా అనిపించి చూస్తున్నాను. అందుకని మీరు కూడా ఇలా ఈ బట్టల్లో దిగిపోయారా?'' అతని చెవుల్లో వాక్‌మెన్ చిరుకోపంతో లాగేస్తూ చెప్పింది.

"సరే...భామామణి! మరి ఇందాక వాళ్ళు వెళుతుంటే అలా ఆ పెద్దపెద్ద కళ్లప్పగించి ఏం చూస్తున్నావ్?'' భార్యను వెనుకనుండి చుట్టేస్తూ అడిగాడు.

"అదా...అలా బైక్‌మీద జామ్ అని పోతుంటే మన పెళ్లైన కొత్తలో అడిగేదాన్ని గుర్తుందా? మిమ్మల్నొక బైక్ కొనుక్కోమని'' కళ్లల్లో పాత కాలం నాటి మెరుపులు, వాటి వెనుకే ఆశ తీరలేదనే బాధ... భర్తని విడిపించుకుంటూ చెప్పిందామె.

ఒక్కసారిగా ఎక్కడికో వెళ్లిపోయాయి ఇద్దరి మధురస్మృతులు.

★ ★ ★

రాధాగోపాలం అంటూ ఒకే పేరుగా, ఒకే మనసుగా పెరిగిన బావామరదళ్ళు వాళ్ళు. బెజవాడ దగ్గర వీరవల్లె రాధావాళ్ళదైతే, ఏలూరు దగ్గర బొమ్మలూరు గోపాలానిది. పల్లెలు మనదేశానికి పట్టుకొమ్మలు అనే నానుడినుండి పుట్టినట్లుగా అచ్చమైన పదహారణాల పల్లెటూళ్ళు వాళ్లవి. వాళ్లకి ఊహ తెలిశాక గుర్తుండిపోయిన స్మృతిపీచాక ఏదో మనసును తాకింది ఇద్దరినీ.

ఓసారి సెలవులకని మేనమామగా ఊరు వచ్చింది రాధ కుటుంబం. ఓ రోజు రాధకిష్టమని కొలనులో తామరపూలు తెంపడానికి వెళ్లాడు గోపాలం. రాములవారి గుడి ఆపక్కనే చిన్న కొలను తామరపూలతో నిండి అందంగా కనిపిస్తోంది. మరో ప్రక్క బండరాళ్ళు. ఓ బండరాయి మీద కూర్చుని రెండుచేతులు బుగ్గలకు ఆన్చుకుని పెద్దకళ్ళు అల్చిప్పల్లా అటూ ఇటూ తిప్పుతూ ఊపిరి బిగపట్టి భయం భయంగా చుట్టూ చూస్తోంది పధ్నాలుగేళ్ల రాధ. ఒకటి...రెండు...మూడు క్షణాలు గడిచిపోతున్నాయి.

"ఇంకా రాలేదే'' రాధ మనసులో ఆతృత.

"ఇక లాభం లేదు'' అనుకుంటూ ఏటిప్రక్కనున్న పెద్దబండ చాటున అప్పటివరకూ దాక్కున్న గోపాలం చేతిలో తామరపూలతో బయటికొచ్చాడు.

"హమ్మయ్య...వచ్చావా?'' రాధ కళ్లల్లో ఆనందం పదిహేడేళ్ల గోపాలానికి హాయిగా అనిపించింది.

"అమ్మలూ! ఇంతసేపూ నేను కనిపించకపోతే భయపడి ఏడుస్తావనుకున్నా'' పూలు లేత తమలపాకుల్లాంటి ఆమె చేతులకందిస్తూ చెప్పాడు.

"అమ్మో! ఏడుపే'' గుండెలమీద చెయ్యేసేసుకుంటూ బోల్డంత ఆశ్చర్యపోయింది. అతని ముఖంలో విస్మయం. ప్రశ్నార్థకం, రకరకాల భావాలు.

"ఏడవకూడదట. నిన్న గుళ్ళో చిన్నత్తయ్యకి పూజారిగారు చెప్తుంటే విన్లేదా? ఆడవాళ్ళు ఏడిస్తే మగవాడికి ఆయుక్షీణమట. అందులోనూ మొగుడూ, పెళ్లాలైతే మరీనట'' పసితనం చిందే మొహంతో అమాయకంగా చెప్తుంటే నవ్వొచ్చింది అతనికి. అవును మరి చిన్నప్పట్నించీ అందరూ వాళ్లని మొగుడూ, పెళ్లాలనే పిలుస్తారు.


"పద...పద... ఇప్పటికే లేటైంది. అందరూ ఎదురుచూస్తుంటారు'' పసిబిడ్డని పొదుపుకున్నట్లుగా ఆమె భుజం మీద చేయి వేసి తీస్కెళ్ళాడు. ఇప్పటిలాగా స్కూల్ వయసులోనే బాయ్‌ఫ్రెండ్స్‌ని, గర్ల్‌ఫ్రెండ్స్‌నీ మెయిన్‌టైన్ చేసే కాలం కాదది. వాళ్ల బంధంలో కాస్తంత స్నేహం, మరి కొంత ప్రేమ, ఆత్మీయత మాత్రమే ఉండేవి.

మరికొన్నాళ్లకి అగ్రికల్చరల్ బిఎస్సీ చదివిన గోపాలం సొంత ఊరినే ఇష్టపడి అక్కడే తండ్రితో పాటూ వ్యవసాయంలో దిగిపోయాడు. రాధ అతని ఇంటి ఇల్లాలైంది. సిటీలైఫ్ మీద ఆమెకి కోరిక ఉన్నా బావకోసం ఆ ఆశని తుంచేసుకుంది.

గోపాలం తండ్రిది ఉమ్మడికుటుంబం కావడంతో గోపాలం చిన్నాన్నలు, వాళ్ల పిల్లలు అంతా

కలిసే ఉండేవారు. ఖర్చులెక్కువగా వుండేవి. అంతమందీ వ్యవసాయం మీదే ఆధారపడడంతో ఆర్థిక అవసరాలు తీరడం కొంచెం ఇబ్బందిగానే ఉండేది. ఎప్పుడైనా బెజవాడ కనకదుర్గ గుడికో, షాపింగ్‌కనో వచ్చినప్పుడు అక్కడ వచ్చే పోయేవాళ్లను చూస్తూ అడిగీ అడగనట్లుగా బావ మనసు నొచ్చుకోకూడదన్నట్లుగా అడిగేది బైక్ ఒకటి కొనుక్కోమని. బొమ్మలూరులో సైకిళ్ళు, ఎండ్లబండ్లు తప్పితే బైక్ నడిపే వాళ్ళు ఉండేవాళ్ళు కాదు.

"అలాగే. వచ్చే ఏడు చూద్దాములే'' అనేవాడు గోపాలం. తనంటే ఆమెకి ఎంత ప్రేమో అతనికి



తెలుసు. తన విషయానికొచ్చేటప్పటికి ఆమె ఎంత సెంటిమెంటల్‌గా మారిపోతుందో తెలుసు. ఆఖరికి ఒక స్త్రీగా డెలివరీ పెయిన్స్ టైంలో కూడా ఆమె కళ్ల వెంబడి నీటి చుక్క రాలేదు. ఎప్పుడో చిన్నతనంలో పూజారి చెప్పిన మాటలు ఆమె మనసు పొరల్లో దూరి ఆమె దుఃఖాన్ని దిగమింగేవి.

* * *

ఒకసారి గోపాలానికి పొలం గట్టున వస్తుంటే ఎద్దొకటి అదుపుతప్పి అతన్ని గుద్దేసింది. సీరియస్ అన్నారు. అందరూ హాస్పిటల్‌లో చేరగిలబడి ఏడుస్తుంటే ఆమె మాత్రం ఒడిలో ఇద్దరు చిన్నపిల్లలతో అలాగే కళ్ళు విప్పార్చుకుని ఏ దేవుడ్నో ప్రార్థిస్తున్నట్లుగా, ధ్యానంలో ఉన్నట్లుగా ఉండేది. ఇంట్లో అందరికీ అదొక ఆశ్చర్యకరమైన విషయం అయింది. కానీ గోపాలానికి ఒక్కడికే తెలుసు ఆమె కంటనీరు ఎందుకు పెట్టదో. ఆ తర్వాత అదొక ఛాలెంజీగా తీస్కుని కొన్నిసార్లు ఆమెను ఏడ్పించాలని ట్రై చేసి దెబ్బతిన్నాడు గోపాలం. అటువంటి ఇంతి మొదటికోరిక బైక్ కొనాలని. దాని మీద విహరించాలని.

అతను మాత్రం ఎలా కాదనగలడు. అతనూ సిన్సియర్‌గానే ట్రై చేశాడు. కానీ కాలం కలిసిరాలేదు.

* * *

ఓ సారి చిన్నపిల్లల చదువులకని, ఇంకోసారి వర్షాలు పడక పంట నష్టమై, మరోసారి పండుగలు, పబ్బాలు, పెళ్ళిళ్ళు...ఇలా ఏదో ఒక అవసరానికి బైక్ కోసం దాచిన డబ్బులు వాడాల్సి వచ్చేది. కాలక్రమంలో వాళ్ల జీవితంలో ఎన్నో మార్పులొచ్చాయి. బోల్డన్ని కొత్త వస్తువులు వాళ్లింట్లో చోటుచేసుకున్నాయి. కొత్తగా బైక్ కొనుక్కుని నడిపే వయసు దాటిపోయింది. పిల్లలు, సంసారబాధ్యతలు, వీటిలో పడి తన భార్యకి ఓ కోరిక వుందని అతనికి గుర్తుకురావటమూ తగ్గింది. క్రమేణా దానిమీద ఇంట్రెస్టు పోయింది.

కూతురూ, కొడుకూ పెద్దవాళ్లైపోయారు. కొడుకు బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తూ నెలకు రెండు లకారాలు కళ్లజూస్తున్నాడు. తల్లికి తండ్రికి ఏకంగా ఓ కారు కొని పంపి, దానితో పాటూ ఓ డ్రైవర్‌ని ఏర్పాటుచేసి దాన్లోనే తిరగమన్నాడు. ఆర్నెల్ల క్రితం పెళ్లైన కొడుకు కొత్త కాపురం ఎలా ఉందో చూడాలనే వాళ్ళు మొదటిసారిగా రాష్ట్రం దాటారు.

* * *

పాలు మరుగుతున్న వాసన రావడంతో గత స్మృతుల నుంచి బయటపడి వంటగదిలోకి నడిచింది రాధ ఉరఫ్ రాధమ్మ. "అయితే నీకు మన లైఫ్ కన్నా...ఇప్పటితరం వాళ్ల జీవితాలే బాగున్నాయంటావ్?'' గదిగుమ్మం దగ్గర నుంచుని ఇందాకటి మూడ్‌లోనే అడిగాడు గోపాలం. "అలాగని కాదు. కానీ పొరుగింటి పుల్లకూర రుచి అన్నట్లు ఎవరికైనా ఎప్పుడైనా పక్కవాళ్ళ జీవితాలే క్రేజీగా ఉంటాయి'' చెప్పింది కాఫీ కప్ అతనికి

అందిస్తూ.


"చూస్తున్నావుగా. మనమిక్కడికి వచ్చి మూడు వారాలైంది. కోడలొక ఆఫీసు, వీడొక ఆఫీసు. ఇరవై నాలుగ్గంటలూ పని...పని... ఒకటే ఒత్తిడి, బిజీ. ఆ అమ్మాయికి పగలైతే, వీడికి రాత్రిళ్ళు కూడా వర్క్ బిజీ. భార్యభర్తలిద్దరూ రోజులో ఎంతసేపు ఒకళ్లనొకళ్ళు చూసుకుంటున్నారు? ఎంతసేపు కలిసి గడుపుతున్నారు? డబ్బులకోసం పరుగులు తప్పితే?'' కాఫీ సిప్‌చేస్తూ ఆగాడు మధ్యలో. "దానికి తగినట్లుగా అన్ని సౌకర్యాలు ఈ చిన్నవయసులోనే పొందుతున్నారు కదా'' కొద్దిగా సమర్థించుకుంది రాధ.

"అవునవును. మనం రాకముందు వాళ్ళ మధ్యలో మాటలేంటో తెలుసా. ఫ్రిజ్‌లో కూర, చారు ఉన్నాయి వేడి చేస్కోండి అని ఆ అమ్మాయి, ఈరోజు ఆఫీసులో లేటవుతుంది అని వీడూ ఫోన్‌కాల్స్ చేస్కోవడం. ఎవరిపాటికి వాళ్ళు డబుల్‌కీస్ పెట్టుకుని గెస్ట్‌ల్లాగా ఇంటికి వచ్చిపోవడం. ఇంట్లో భార్య ఒక్కత్తే అని లోలోపల వాడికి టెన్షన్. ఇక శని, ఆదివారాలు వస్తే ఇంట్లో ఉంటారా? వీకెండ్స్ పిక్‌నిక్‌లూ, పార్టీలూ పదిమందితో కలిసి సరదాలు. వీళ్లిద్దరూ కలిసి గడిపేదెప్పుడు? ప్రశాంతంగా కబుర్లు చెప్పుకునేదెప్పుడు? నీకు గుర్తుందా? పొలంగట్టున ఎప్పుడైనా కాపలాకి వెళ్ళాల్సి వస్తే నాకెంత నిశ్చింత, ధైర్యం. మా వాళ్లందరి మధ్య నువ్వు సేఫ్‌గా ఉంటావని. సాయంత్రాలు మేడపైన నీ ఒడిలో పడుకుని పక్కనే జాజిపూల చెట్టు నుంచి వచ్చే సువాసనలన్నీ ఆఘ్రాణిస్తూ, పున్నమి చంద్రుణ్ని నీ ముఖంలో వెతుక్కుంటూ...కబుర్లు. చెప్పుకుంటూ ఎలా గడిపేవాళ్లం? ఆ అవకాశం వీళ్లకుందా? అలాంటి అనుభూతులు వీళ్లకి తెలుసా? అంతా ఫాస్ట్...ఫాస్ట్...ఫాస్ట్'' కొడుకుని, దానితోపాటు నవతరాన్ని ఉద్వేగంగా నిందిస్తున్న అతనికి బిపి టాబ్లెటిచ్చింది రాధ.



## అందాలభామ ఆకాంక్ష

బాస్‌లో నాగార్జునతో కలిసి నటించిన అందాలభామ పూనమ్ బజ్వా. తెలుగులో పెద్ద హీరోలతో కలిసి నటించాలని ఇండస్ట్రీకొచ్చిన కొత్తలో అనుకున్నాను అదిలా నెరవేరింది అంటోంది పూనమ్. ఏప్రిల్ ఐదున పుట్టిన ఈ భామకి పుస్తకాలు చదవడం అన్నా, సినిమాలు చూడడం అన్నా చాలా ఇష్టంట. శాంతికి చిహ్నమైన వైట్ కలర్ అంటే తనకి ప్రాణమని, అందుకే నేను ఎక్కువగా ఆ కలర్ డ్రెస్సులేసుకుంటానంటోంది. ప్రస్తుతం తాను బియే లిట్ చదువుతున్నానని, తెలుగులో మంచి హీరోయిన్‌గా గుర్తింపు పొందాలన్నదే తన ఆశయం అంటోంది.




* * *

మూడువారాలుగా వీళ్లనీ వీకెండ్స్‌లో బయటికి తీసుకెళుతున్నారు అభిరాం, మృదుల. ఇక బోర్‌కొట్టి "మీరు ఫ్రీగా వెళ్లండి. పొద్దస్తమానూ మాతో నేనా?'' అన్నాడు గోపాలం. అభిరాం మరీ బలవంతం చేస్తే "మమ్మల్ని ఫ్రీగా వదిలేసి మీరెళ్లండ్రా'' అంటూ చెప్పేశాడు. రాధ మొహం కొడుకు, కోడలు ముందు ఎరుపెక్కిపోయింది. కోడలు ముసిముసిగా నవ్వుకుంటూ లోపలికి వెళ్లిపోయింది. 'ఈయన ఇప్పటికీ పాతికేళ్ళ గోపాలంలాగానే ఫీలవుతారు' రాధ మనసులోనే గొణుక్కుంది.

* * *

"వాడెన్నిసార్లు రమ్మన్నా వద్దన్నది...ఇలా నా మెదడు నంజుకుతినటానికేనా?'' నవ్వుతూ అడిగింది రాధ భర్తని.

"అఫ్‌కోర్స్ ఈ తరాలు మనలా కాకుండా అన్ని బెనిఫిట్స్ పొందుతున్నారనుకో. అందుకే త్వరగా సంపాదించగలుగుతున్నారు'' కాస్త తగ్గుతూ సావధానంగా అన్నాడు.

"నష్టాలంటారు...లాభాలంటారు....అన్నీ మీరే చెప్తారు. నాకవతల పనుంది'' అంటూ రాధ లోపలికి నడిచింది. ఆమె మాటలు పట్టించుకోనట్లుగా ఏదో ఆలోచనలో పడిపోయాడు గోపాలం. మరో పదిరోజులకి తెల్లవారుఝామున చలికాలం కావడంతో మంచుపొరలు వీడలేదు. అభిరాం ఆఫీసు పని అంటూ అంత పొద్దున్నే బయటికెళ్లిపోయాడు. మృదుల పగలంతా వర్క్ చేసి రాత్రి లేటవ్వటంతో అలసిపోయి పడుకుని ఇంకా లేవలేదు. అలవాటు చప్పున రాధ చీకట్లోనే స్నానం చేసి వచ్చింది. "అమ్మలూ... ఇవిగో ఇవి కట్టుకో'' ఓ చుడీదార్ జత ఆమె చేతిలో పెడుతూ చెప్పాడు గోపాలం.

"ఏమిటండీ ఇవీ?'' చేత్తో అటూ ఇటూ తిప్పుతూ అడిగింది ఆమె.

"ముందు డ్రెస్ ఛేంజ్ చేసుకురా. త్వరగా...'' తొందరపెట్టాడు.

యాభై నాలుగేళ్ల వయసులో సిగ్గుగా, ఇబ్బందిగా చుడీదార్‌తో భర్త ముందుకొచ్చింది ఆమె. ఆమె రెడీ అయ్యి వచ్చేటప్పటికీ ఒంటిమీద స్వెట్టర్, మంకీ క్యాప్ ఫుల్ పేకేజిలో ఉన్నాడు అతను. పొలం పనులతో కాయ కష్టం చేసేవాడు కావడంతో అక్కడక్కడా నెరిసిన వెంట్రుకలు తప్పితే పొడవుగా, సన్నగా చిన్నవాడిలాగానే ఉంటాడు గోపాలం. అతనికి తగ్గట్లుగా సరిజోడీగా ఉంటుంది రాధ. "బావుందోయ్ డ్రెస్'' ఆమెని చూస్తూ ప్రశంసించాడు.

ఆ మాత్రానికే ఆమె చెంపలు కెంపులయ్యాయి.

"ఇదిగో ఈ చున్నీని ఇలా తలచుట్టూ తిప్పుకుని మెడమీదుగా వేసుకో. కళ్లకి ఈ గాగుల్స్ పెట్టుకో'' అని చెప్తూ తనే సరిచేశాడు.

"ఊఁ సినిమా స్టార్‌లా ఉన్నావు'' పై నుంచి క్రింది దాకా ఆమెని చూస్తూ చెప్పాడు. భర్త ప్రశంసలు భార్యకెప్పుడూ తొలకరి జల్లుల పులకరింతలే.

ఆనందం బయటికి కనపడనివ్వకుండా అడిగింది "ఇప్పుడివన్నీ ఎందుకూ?''

"ష్...'' అని సైగచేశాడు గోపాలం మాట్లాడవద్దని, కోడలు లేస్తుందని.

"ఇలారా'' అంటూ బయటికి లాక్కొచ్చి ఇండోర్ లాక్ సిస్టమ్ కావడంతో

అలాగే తలుపు దగ్గరికి లాగేశాడు.

ఇంటి బయట నిగనిగలాడుతూ కనిపిస్తోంది హీరో హోండా.

"కూర్చో!" చెప్పాడు స్టార్ట్ చేయబోతూ. ఆమె విస్తుబోయి చూస్తోంది.

"త్వరగా..అలా పక్కగా కాదు. వెనగ్గా అటో కాలూ, ఇటో కాలూ వేస్కుని" అంటూ చెప్పాడు.

"నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అన్నాట్ట మీలాంటివాడొకడు. క్రిందపడితే అందరి ముందూ పరువుపోతుంది. అయినా ఈ వయసులో..." సగం గాభరా, భయం కలిసిపోగా చెప్పింది.

"మన వయసులు కనపడకూడదనేనోయ్ ఈ పేకేజీలు. అయినా ఇదేమైనా మన ఊరిలా చిన్న ఊరనుకున్నావా? ఈ మహానగరంలో మన గురించి తీరిగ్గా ఆలోచించేదెవరు? ఇక డ్రైవింగ్ అంటావా? అయామ్ హియర్. డోంట్ ఫియర్. మై హూ నా?" ఉత్సాహంగా మాట్లాడుతూ కిక్ కొట్టి స్టార్ట్ చేశాడు.

బెంగుళూరు నుంచి డెబ్బై కిలోమీటర్ల దూరంలో ఉన్న కోలార్ వైపు దూసుకుపోసాగింది బైక్. జీవితంలో మొదటిసారిగా బైక్‌మీద కూర్చుంది ఆమె. ఓ పక్క భయం. మరో పక్క గాల్లో తేలిపోతున్నట్టు..లేటు వయసులో లేటెస్ట్ అనుభూతి. కొడుకుతో పాటు కూడా ఆమె ఎప్పుడూ టూ వీలర్స్ ఎక్క లేదు. "ఇలా... ఈయనతో ఈ అనుభూతి నాకు దొరకడం కోసమే కాబోలు..." అనుకుంది చిరునవ్వుతో. మధ్యలో కాఫీ స్టాల్ దగ్గర ఆపాడు. ఆమె బైక్ మీద కూర్చున్న విధానం.. బ్యాక్‌సీట్లోంచి కొంతమంది విస్మయంగా చూశారు.

"వాళ్లంతా మనల్నే చూస్తున్నారు" ఇబ్బందిగా చెప్పింది రాధ.

"చూడనీవోయ్. ముసలాళ్ళు దసరా పండుగ చేసుకుంటున్నారు అను కుంటారు" నవ్వుతూ చెప్పాడు. మరికొంత దూరం పోయాక..

"దిగు" బైక్ ఆపుతూ చెప్పాడు.

ఎదురుగా చూసింది ఆమె. కోటి లింగాల శివుని గుడి. ఇద్దరూ లోపలికి నడిచారు. అత్యంత అద్భుతంగా....పరమశివుడే దిగి వచ్చి నిలయముంటున్న ట్లుగా ఉంది ఆ గుడి. గుడి ఆవరణలో, మంటపంలో బోల్డన్ని శివలింగాలు. పక్కనే చిన్నకొలను. దైవదర్శనం చేసుకున్నాక గుడి ఆవరణలో పొగడపూల చెట్టు క్రింద కూర్చున్నారు ఇద్దరూ. చుట్టూ జారిపడి నేలంతా పరుచుకుని ఉన్నాయి తెల్లని పువ్వులు. "విష్‌యూ హేపీ మ్యారీడ్‌లైఫ్" రాధ చేతిలో కొబ్బరిముక్క పెడుతూ కొలనులో తెంపుకొచ్చిన తామరపువ్వులు మరో చేతి కందిస్తూ చెప్పాడు గోపాలం. "సేమ్ టూ యూ" ఉదయించిన బాలభానుడి కెంజాయరంగులన్నీ తన మోముకి కలిసిపోతుండగా చెప్పింది ఆమె. సంతో షంగా ఇంటికి బయల్దేరారు ఇద్దరూ. పెళ్లిరోజుని ఈ విధంగా సెలబ్రేట్ చేసు కోవడం ఆనందంగా ఉంది ఇద్దరికీ. ముఖ్యంగా రాధకి ఓ గొప్ప అనుకోని అనుభూతి.

"బావా! ఎంత సంతోషంగా ఉందో తెలుసా? ఆ గుడి, ఆ ప్రశాంత వాతావ రణం, ఈ బైక్...ఈ ప్రయాణం" ఈసారి కాస్తంత ధైర్యంగా గట్టిగా కుదురుగా కూర్చుని హాయిగా అతన్ని వెనుకనుండి హత్తుకుంటూ చెప్పింది ఆమె.

మనసు ఉల్లాసంగా ఉన్నప్పుడు ఏకాంతంలో ఈరోజుకీ భర్తని అలాగే పిలుస్తుంది బావా అని.

"ఇంత బాగా డ్రైవింగ్...ఈ వయసులో లైసెన్స్?" అప్పుడొచ్చింది ఆమెకి అనుమానం. అంటే ఈ వారం పదిరోజులుగా రోజూ మోకాళ్ల దగ్గర, మోచే తుల దగ్గర గీరుకుపోయి అక్కడక్కడా చర్మం ఎర్రగా కందిపోయి సాయం త్రాలు కీళ్లనొప్పులంటూ తనతో కాళ్ళు పట్టించుకోవడం, మూవ్ రాయించు కోవడం...ఏమైందని అడిగితే బయట పార్కులో పిల్లలాడుకునే బ్యాట్, బాల్ తగిలిందని చెప్పడం. తనకోసం....కేవలం తన కోరిక తీర్చడం కోసం బైక్ నడ పడం నేర్చుకున్నాడా? అప్పుడొచ్చిందామెకు దుఃఖం కట్టలు తెంచుకున్న వరద గోదారిలా ఉధృతంగా.. పద్నాలుగేళ్ల వయసులో అతను కొలను చాటున కనపడకుండా పోయినప్పుడు ఆపుకున్న దుఃఖం, పురిటినొప్పుల్తో అల్లాడుతూ అతని శ్రేయస్సు కోసం ఆపుకున్న కన్నీరు...అతను చావుబతు కుల్తో పోరాడుతూ తన బ్రతుక్కి క్వశ్చన్ మార్కు పెట్టినప్పుడు పడ్డ బాధ...అన్నీ... అన్నీ గతకాలపు గుర్తులు...తనలో తానే అదుముకుంటూ బడ బాగ్నిలా దాచుకుంటూ వచ్చింది ఇన్నాళ్ళూగా. ఇప్పుడు వయసు బిగువు...పట్టు సడలడంతో బింకం వదిలేసి దూకి పడుతోంది కన్నీరు.

"ఏయ్! భార్య ఏడిస్తే భర్తకు మంచిదికాదు. గుళ్ళో పూజారిగారు చెప్పారు గుర్తులేదా?" బైక్ అలానే పోనిస్తూ నవ్వుతూ అడిగాడు.

"ఇది ఆనందంతో వచ్చిన కన్నీరు" అతని భుజం మీద తలవాల్చు కుంటూ చెప్పింది ఆమె. ఆ జంటని చూసి ఆనందిస్తూ 'ఆమె ఇష్టాన్ని అతనూ, అతని బాధను ఆమె పంచుకుంటూ ఇలాగే కలకాలం జీవించండి, అర్ధనారీశ్వరతత్వంతో మెలగండి' అని ఆ పార్వతీ పరమేశ్వరులు పైనుండి ఆశీ ర్వదిస్తున్నట్లుగా సన్నని చిరుజల్లులు మొదలయ్యాయి.

★

## 150 ఏళ్ల తాబేళ్ళు

గలాపెగాస్ దీవుల్లో ఉండే తాబేళ్ళు ప్రపంచంలో అతి పెద్దవిట. అన్ని టిలోకి పెద్దది 1.2 మీటర్ల పొడవు, 300 కిలోల బరువు వుంటుందిట. ఈ తాబేళ్ళు ఎంతకాలం బ్రతుకుతాయో చెప్పగలిగిన మనుషులు లేరుగానీ ప్రస్తుతం జీవించివున్న తాబేళ్లనిబట్టి 150-200 ఏళ్ళు బ్రతుకుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## విచిత్ర కవలలు

లండన్‌లో మిడిల్స్‌బరోలో రిచార్డ్‌సన్ దంపతులకి కవలలు పుట్టారు. తండ్రి తెల్లవాడు. తల్లి నైజీరియాకి చెందిన మిశ్రమ జాతి వనిత. పుట్టిన ప్పుడు కవలలిద్దరూ తెల్లగానే ఉన్నారు. అయితే చిత్రంగా వాళ్ల కాస్త ఎది గాక ఒకడు నల్లగా మారిపోయాడు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ జెనిటిక్స్ నిపు ణుడు ఏ కారణం చేతనో శరీర వర్ణానికి సంబంధించిన జన్యువులు కలవలే దని, అందువల్ల తల్లి నుంచి తీసుకున్న జెనిటిక్ కోడ్స్ వేరువేరుగా పిల్లలకి వచ్చి ఉండవచ్చుని, అలాంటి పుట్టుక అసాధారణమని, ఎక్కడో పదిలక్షల మందిలో ఒకరికిలా జరగవచ్చునని అంటున్నారు.

-తటవర్తి

